ఆపన్నులను ఆదుకుంటా

మంత్రి కొలుసు పార్థసారధి

ప్రజాశక్తి - ముసునూరు

ఆపదలో ఉన్నవారిని ఆదుకుంటానని సమాచార పౌర సంబంధాల శాఖ, గృహనిర్మాణ శాఖా మంత్రి కొలుసు పార్థసారధి అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో మృతి చెందిన వారి కుటుంబాలను ఆయన ఆదివారం పరామర్శించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. అనం తరం గోపవరం శివారు పెదపాటివారిగూడెం గ్రామంలో దల్లి శరత్‌కుమార్ కుమార్తెల ఓణిల వేడుక కార్యక్రమానికి హాజరయ్యారు. అనంతరం మంత్రి కొలుసు పార్థసారధి మాట్లాడుతూ సిఎం చంద్రబాబు ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తున్నారన్నారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం పనులు త్వరలోనే ప్రారంభిస్తానని చెప్పారు. ఆయనతో పాటు దేవినేని ఢలరామ్, గద్దె రఘుబాబు, బుజ్జియ్య ఉన్నారు.

రేషన్ బియ్యం పక్కదారి..!

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

రేషన్ బియ్యం పక్కదారి పడుతున్నాయి. ఈ తంతు అంతా రేషన్ పంపిణీ చేసే వాహనాల వద్దే జరుగుతున్న తీరు అందరినీ విస్మయానికి గురిచేస్తోంది. రేషన్ మాఫియాతో చేతులు కలిపి సాగుతున్న ఈ దందాను అడ్డుకునేందుకు రెండు జిల్లాల్లోని అధికారులు కనీస చర్యలు తీసుకోని పరిస్థితి నెలకొంది. ఒకటి, రెండు దాడులు నిర్వహించి మమ అన్పించేస్తున్న పరిస్థితి కొనసాగుతోంది. గత ప్రభుత్వ హయాంలో విచ్చలవిడిగా కొనసాగిన ఈ దందా కొత్త ప్రభుత్వం వచ్చిన తర్వాత సైతం కొనసాగుతున్న తీరు సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలో 11.73 లక్షల తెల్లకార్డులు ఉన్నాయి. కార్డులోని ప్రతి వ్యక్తికీ ఐదు కిలోల చొప్పున బియ్యాన్ని ప్రభుత్వం అందిస్తోంది. గతంలో కిలో రూపాయికి ఇవ్వగా కరోనా తర్వాత ఉచితంగా ఇస్తున్న పరిస్థితి కొనసాగుతోంది. 2019 ఎన్నికల ముందు తాము అధికారంలోకి వస్తే రేషన్ దుకాణాల్లో నాణ్యమైన సన్నబియ్యం అందిస్తామని వైసిపి వాగ్దానం చేసినప్పటికీ అమలుకు నోచుకోలేదు. ఎన్నో పేద కుటుంబాలు రేషన్ బియ్యంతోనే కడుపు నింపుకుంటున్నాయి. మారిన కాలమాన పరిస్థితుల నేపథ్యంలో సుగర్ వంటి వ్యాధుల కారణంగా రేషన్ బియ్యం తినేందుకు చాలామంది జంకుతున్నారు. ప్రజలు తినే నాణ్యమైన బియ్యం అందించడంలో ప్రభుత్వం విఫలమవుతోంది. ఇదే అదునుగా రేషన్ మాఫియా విచ్చలవిడిగా రెచ్చిపోతుంది. రేషన్ బియ్యం లబ్ధిదారుల నుంచి పెద్దఎత్తున కొనుగోలు చేసి రీసైక్లింగ్ చేసి అమ్మకాలు చేయడం, ఇతర దేశాలకు ఎగుమతి చేయడం వంటి అక్రమాలు పెద్దఎత్తున సాగిస్తోంది. కాకినాడ కేంద్రంగా ఇది పెద్దఎత్తున సాగుతున్నట్లు ఇటీవల బయపడిన సంగతి అందరికీ తెలిసిందే. రెండు జిల్లాల్లో రేషన్ పంపిణీకి 751 వాహనాలను ఉపయోగిస్తున్నారు. గతంలో రేషన్‌దుకాణాల్లో బియ్యం కొనుగోలు చేయాలంటే కొంత భయపడే వారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేకుండాపోయింది. రేషన్ వాహనాల వద్దే కిలో రూ.పది చొప్పున కొనుగోలు చేస్తున్నారు. వేలిముద్ర వేయించుకుని బియ్యం ఇవ్వకుండా డబ్బులు ఇచ్చేస్తున్న పరిస్థితి సాగుతోంది. రేషన్ పంపిణీ సమయంలో వాహనాలు తనిఖీ చేస్తే బియ్యం నిల్వలను బట్టి అసలు విషయం ఇట్టే భయపడుతోంది. అయితే పౌరసరఫరాల శాఖాధికారులు అటువైపు కన్నెత్తి చూడని పరిస్థితి నెలకొంది. ఈ దందా అంతా యథేచ్ఛగానే సాగిపోతుంది. అయినప్పటికీ ఏఒక్కరూ పట్టించుకోని పరిస్థితి నెలకొంది. నాణ్యమైన సన్న బియ్యం అందిస్తే ఏఒక్కరూ విక్రయించారు. ప్రభుత్వం మాత్రం ఆ విధంగా చేయడం లేదు. దీంతో రేషన్ బియ్యం అక్రమార్కుల చేతుల్లోకి చేరుతోంది. ప్రభుత్వం మారడంతో ఇప్పుడైనా రేషన్ బియ్యం కొనుగోలు చేస్తున్న అక్రమార్కులపై చర్యలు తీసుకుంటారా అనే చర్చ నడుస్తోంది.

రెచ్చిపోతున్న మాఫియా
పంపిణీ వాహనాల వద్దే కిలో బియ్యం రూ.10కి కొనుగోలు
అడ్డుకట్ట వేసేందుకు కనీస చర్యలు తీసుకోని అధికారులు
రెండు జిల్లాల్లో 11.73 లక్షల తెల్ల కార్డుదారులు
సబ్సిడీపై కందిపప్పు, పంచదార ఇచ్చేనా?

సబ్సిడీపై కందిపప్పు, పంచదార ఏది..?

2014కు ముందు కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వంలో రేషన్ దుకాణాల్లో తొమ్మిది సరుకులను సంచిలో పెట్టి అందించేవారు. బియ్యం, కిలో పామాయిల్, కిలో చపాతీ పిండి, కిలో గోధుమలు, అరకిలో పంచదార, ఉప్పు ప్యాకెట్, కారం, పసుపు, చింతపండు వంటివి ఇచ్చేవారు. ఇవి పేదలకు ఎంతగానో ఉపయోగపడేవి. 2014లో టిడిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత బియ్యం, పంచదార, చపాతి పిండి, కిరోసిన్‌కు పరిమితమైంది. 2019లో వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత బియ్యం, కందిపప్పు, పంచదార కొంతకాలం ఇచ్చారు. తర్వాత బియ్యం, పంచదార మాత్రమే ఇచ్చారు. కొన్ని నెలలు బియ్యం ఒక్కటే ఇచ్చిన పరిస్థితి ఉంది. కొత్త ప్రభుత్వం వచ్చాక సైతం జులైలో బియ్యం మాత్రమే పంపిణీ చేశారు. కందిపప్పు, పంచదార ఇవ్వలేదు. బహిరంగ మార్కెట్లో విపరీతంగా ధరలు పెరిగిపోయాయి. సబ్సిడీపై సరుకులను రేషన్ కార్డుదారులకు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అంతా కోరుతున్నారు.

గ్రామాల్లో తాగునీటికి ప్రభుత్వం ప్రాధాన్యత

రూ.7.10 కోట్లతో పలు అభివృద్ధి పనులకు ఎంపీ, ఎంఎల్ఎ శంకుస్థాపన

ప్రజాశక్తి - ఉంగుటూరు



శంకుస్థాపన చేస్తున్న ఎంపీ మహేష్, ఎంఎల్ఎ ధర్మరాజు, గన్ని

గ్రామాల్లో ప్రతి ఇంటికీ రక్షిత తాగునీరు అందించేందుకు కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌యాదవ్ అన్నారు. జలజీవన్ మిషన్‌లో భాగంగా ఉంగుటూరు మండలంలోని 14 గ్రామాలకు తాగునీటిని అందించేందుకు రూ.ఏడు కోట్ల 10 లక్షల 50 వేల నిధులతో చేపట్టే అభివృద్ధి పనులకు ఎంపీ మహేష్ ఉంగుటూరు ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు, టిడిపి జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులుతో కలసి పెదవెల్లమిల్లిలోని పంచాయతీ కార్యాలయం వద్ద ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎంపీ మాట్లాడుతూ నేటికీ చాలా గ్రామాల్లో రక్షిత తాగునీరు అందించడంలో గత పాలకులు విఫలమయ్యారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన కొద్ది రోజుల్లోనే అభివృద్ధి పనులను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ఎంఎల్ఎ ధర్మరాజు మాట్లాడుతూ ప్రతిఒక్కరికీ స్వచ్ఛమైన నీటిని ఉచితంగా అందించేందుకు ప్రభుత్వ కృషి చేస్తోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమాన వాటాలుగా ఇచ్చే ఈ గ్రాంటుతో గుళ్లపాడు, కైకరం, నాచుగుంట, రావులపర్రులో ఒ.హెచ్.ఎస్.ఆర్ ట్యాంకులు, పైపులైన్లను నిర్మిస్తారన్నారు. గొల్లగూడెం, వెల్లమిల్లి, గోపాలపురం, పందిరెడ్డిగూడెం, కంసాలిగుంట, యర్రమళ్ల, తల్లాపురం, చింతాయగూడెం, కొత్తగూడెం, వికె.పురాల్లో తాగునీటి ట్యాంకులు, పైపులైన్ పనులకు గత ప్రభుత్వం టెండర్లు పిలిచారని, ఈ 14 గ్రామాల్లో పనులన్నింటికీ ఒకే కాంట్రాక్టర్ టెండరు వేసి దక్కించుకున్నారని తెలిపారు.

ఎంపీ, ఎంఎల్ఎలకు సమస్యల హోరం

వెల్లమిల్లి సరిహద్దు వెంకటరామన్నగూడెంలో ఉన్న హార్టికల్చర్ విశ్వవిద్యాలయంలో అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్టు, డైలీ లేబరు పనులకు వెల్లమిల్లి గ్రామస్తులకు అవకాశం ఇవ్వాలని ఎంపీ, ఎంఎల్ఎను కోరారు. ఉంగుటూరు మండలంలో వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉన్నా తమను కాదని ఇతర ప్రాంతాల వారికి ఉద్యోగాలిచ్చి ఉపాధి కల్పిస్తున్నారని, తమకు అవకాశం కల్పించాలని వెల్లమిల్లి వాసులు విజ్ఞప్తి చేశారు. దీనిపై ఎంఎల్ఎ ధర్మరాజు స్పందిస్తూ ఈ సమస్యను తాను ఇంతకముందే ఎంపీ దృష్టికి తీసుకెళ్లానని, అధికారులతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. హైవే పక్కన బాదంపూడి- నాచుగుంట మధ్య నాచుగుంట క్వారీ మురుగబోదె వల్ల వెల్లమిల్లి, బాదంపూడి గ్రామాలకు చెందిన దాదాపు 450 ఎకరాల పంట వరదలకు దెబ్బతింటున్నాయని, కాలువను తవ్వించాలని పలువురు రైతులు కోరారు. రైతులు నిర్దిష్ట వివరాలతో అర్జీ ఇస్తే దాన్ని ప్రభుత్వంతో చర్చించి పరిష్కారానికి కృషి చేస్తామని ఎంపీ, ఎంఎల్ఎ హామీ ఇచ్చారు. తొలిసారిగా ఎంపీ వెల్లమిల్లి పర్యటనకు రావడంతో టిడిపి, జనసేన శ్రేణులు, గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. ఎన్‌టిఆర్ విగ్రహానికి నేతలు పూలమాలలు వేశారు. కార్యక్రమంలో సర్పంచి వస్కా కుమార్‌రాజా, ఎంపిపి గంటా శ్రీలక్ష్మి, ఎంపిటిసి సభ్యురాలు దండమూడి ఉషారాణి, నెర్సు వర ప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ డిఇ సిహెచ్.రమేష్, పంచాయతీరాజ్ డిఇ ఉప్పలపాటి శ్రీనివాసరావు, ఎఇ హరినాథ్‌రాజు, టిడిపి, జనసేన మండల అధ్యక్షులు పాతూరి విజయ్‌కుమార్, పంది రాంబాబు, నాయకులు బండి స్వరూప్, తాతిన గోపీ, పలు గ్రామాల సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, నేతలు పాల్గొన్నారు.

రైతుల దుఃఖ:దాయని.. నాచుగుంట క్వారీ మురుగు బోదె

ఏటా ముంపుబారిన పడుతున్న 450 ఎకరాలు
మురుగు బోదెను ప్రక్షాళించాలని రైతుల మొర

ప్రజాశక్తి - ఉంగుటూరు

బాదంపూడి నుంచి జాతీయ రహదారికి ఆనుకుని నాచుగుంట వరకూ ప్రవహిస్తున్న నాచుగుంట క్వారీ మురుగుబోదె పూడికతో నిండటం, డ్రెయినేజీ శాఖ పట్టించుకోకపోవడం, ఆక్రమణలు తదితర కారణాలతో ఏటా వందలాది ఎకరాలు వరిపై రు ముంపుబారిన పడుతోంది. బాదంపూడి మత్స్య కేంద్రం నుంచి 3.4 కిలోమీటర్ల పొడువునా నాచుగుంట వరకు మురుగు కాలువ ఉంది. దీన్నే నాచుగుంట క్వారీ మురుగు బోదెగా పిలుస్తారు. ఈ బోదె స్టార్టింగ్ పాయింట్ వద్ద బాటం రెండు మీటర్లు వెడల్పు ఉంచి లాస్ట్ పాయింట్ వద్ద 6 మీటర్లు బాటం వెడల్పు ఉండాలి. బాదంపూడి వద్ద ఏలూరు కాలువ ఎస్కేప్, ప్రకాశరావుపాలెం తదితర ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరంతా ఈ మురుగుబోదె ద్వారా నాచుగుంట వద్ద జాతీయ రహదారి దిగువున అండర్ టన్నెల్ ద్వారా కొల్లేరులో కలవాల్సి ఉంది. ఇదీ క్వారీ మురుగు బోదె నైసర్గిక స్వరూపం.

నాచుగుంట క్వారీ మురుగు బోదెలో దట్టంగా అలుముకున్న తూడు

డ్రెయినేజీ శాఖ నిర్వహణా లోపమే రైతులకు నష్టం

వెల్లమిల్లి, బాదంపూడి గ్రామాలకు చెందిన రైతులకు చెందిన సుమారు 450 ఎకరాల ఆయకట్టు ఉంది. వర్షాకాలంలో చేలల్లో అధిక, వరద నీరంతా మురుగు కాలువలోకి వెళ్లాల్సి ఉంది. అయితే స్థాయికి మించి వరద నీరు ఈ మురుగుబోదెలోకి రావడం, ఆ నీరం తా దిగువకు వెళ్లే దారులు పూడిపోవడం, అనధికార ఆక్రమణలు, తూ రలు పెట్టి దారులు వేయడం, గుర్రపుడెక్క, తూడు తొలగించే పను లను సకాలంలో చేపట్టకపోవడం వల్లే తమ పొలాలు ముంపుబారిన పడుతున్నాయని ఆయకట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అక్రమ కట్టడాలే ముంపునకు కారణమా

ఈ బోదె వెళ్లే దారిలో పలుచోట్ల అనుమతులు లేకుండా తూరలతో దారులు వేశారు. ఆ తూరలు కుంగిపోయి మట్టితో పూడుకుపోవడంతో నీటి ప్రవాహం ఆగిపోయి ఆ నీరంతా వెనక్కి పొడిచి పొలాలను ముంచెత్తుతోంది. అంతేకాకుండా దీన్ని ఆనుకుని చేపల చెరువులు వెలిశాయి. వాటి నుంచి కూడా నీటి ప్రవాహం పెరుగుతోందని రైతులు వాపోతున్నారు.

ప్రతియేటా ముంపుతో తీవ్ర నష్టం
చంద్రు రామకృష్ణ, రైతు, బాదంపూడి

నాచుగుంట క్వారీ మురుగుబోదె మా పాలిట దుఃఖ:దాయనిగా మారింది. కొద్దిపాటి వర్షం వస్తే వరినారు కుళ్లిపోతోంది. ఇటు జాతీయ రహదారి, అటు రైలుమార్గం మధ్యలో వెల్లమిల్లి, బాదంపూడి గ్రామాలకు చెందిన 450 ఎకరాల్లో వరిని పండిస్తున్నాం. ప్రకాశరావుపాలెం, తెలికచర్ల, వెంకటరామన్నగూడెం, తాడిపూడి కాలువ తదితర 9 ప్రాంతాల నుంచి వరద నీరంతా ఈ బోదె ద్వారా నాచుగుంట వద్ద యుటి-3 నుంచి కొల్లేరులోకి వెళ్లాలి. అయితే వెల్లమిల్లి రేవు వద్ద బోదెపై తూరలు పెట్టి దానిపై దారి పోశారు. ఆ తూరలు శిథిలమై మట్టి జారిపోయి బోదె పూడుకుపోవడం వల్లే నీరు నాచుగుంట వైపు వెళ్లే దారిలేక రివర్స్‌ఫ్లోతో బోదె నిండిపోతుంది. ఆ నీరంతా మా పొలాలను ముంచెత్తడం ప్రతియేటా సర్వసాధారణమైంది. నేను ఐదెకరాలు సాగు చేస్తున్నాను. వరదలకు సగం పంట నష్టపోవాల్సి వస్తోంది. బాదంపూడి ఎస్కేప్ వద్ద అధిక నీటిని దిగువకు వదిలే చర్యలు చేస్తే కొంతవరకు ఉపశమనం. ఎన్నిసార్లు ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకున్నా మా బాధలు తీరడం లేదు.

రైతు గోడు పట్టించుకునే వారు లేరు
సిహెచ్.అప్పారావు, రైతు, బాదంపూడి

ఏదోకసారి వరద ముంపు అంటే ప్రకృతి వైపరీత్యం అనుకోవచ్చు. అయితే వర్షాకాలంలో ప్రతియేటా మాకు పెద్ద సమస్యగా మారింది. బాదంపూడి నుంచి వెల్లమిల్లి రేవు వరకూ తూడు, గుర్రపుడెక్క దట్టంగా పేరుకుపోయింది. దీనికి తోడు వెల్లమిల్లి రేవు వద్ద 20 టన్నుల లారీలు వెళ్లేందుకు మురుగుకాలువపై ఓ వ్యాపారి తూరలతో పూడ్చారు. అందువల్ల నీరు ముందుకు కదలడం లేదు. ఆ నీరంతా మా పొలాల పైకి పొంగిపొర్లుతోంది.

అధికారులను ఆదేశించాను
ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు

నాచుగుంట క్వారీ మురుగు బోదెలో పూడిక, తూడు పనులను యుద్ధప్రాతిపదికన తీయించేలా అధికారులను ఆదేశించాను. సోమవారం నుంచి పూడిక తీత పనులు చేయిస్తామని డ్రెయిన్స్ ఎఇ చెప్పారు. రైతులకు నష్టం రాకుండా చేపట్టాల్సిన చర్యలపై అధికారులతో సమీక్షిస్తాను.

పూడికతీయించే చర్యలు తీసుకుంటాం
డ్రెయినేజీ శాఖ ఎఇ ఎవి.సత్యనారాయణ

నాచుగుంట క్వారీ మురుగుకాలువలో పూడిక, తూడు, గుర్రపు డెక్క తొలగింపు వెంటనే చేపడతాం. వాస్తవంగా ఈ మురుగు కాలువ వెంబడి పలు ఆక్రమణలున్నాయి. బోదెను యంత్రాల సాయంతో తవ్వించాలంటే నిబంధనల ప్రకారం ప్రతి మూడేళ్లకు ఒకసారి చేపట్టాల్సి ఉంది. ప్రతిపాదనలు పెట్టి అనుమతులు తీసుకుని వచ్చే వేసవిలో బోదెను తవ్వించే చర్యలు తీసుకుంటాం. ప్రస్తుతం ఉన్న ఈ బోదెను 40 మీటర్ల వెడల్పు చేయాలని రైతుల కోరిక మీదట గతంలోనే ప్రతిపాదనలు పంపి కావాల్సిన భూసేకరణ కోసం తమ శాఖ నుంచి అన్ని ప్రయత్నాలూ చేశాం. అయితే ఆరు వరుసల జాతీయ రహదారి విస్తరణ లేకపోవడంతో ప్రతిపాదనలకు అనుమతులు రాలేదు. పలు మురుగుబోదెల్లో పూడిక తీసేందుకు నిధులొచ్చాయి. నాచుగుంట క్వారీ మురుగు బోదెలో పూడికతీత పనులు రూ.14 లక్షలతో చేయిస్తాం.

ఒపిఎస్ అమలు చేయాలి

యుటిఎఫ్ ఆధ్వర్యాన జిపిఎస్ గెజిట్ ప్రతులు దహనం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

జిపిఎస్ ప్రతులు దహనం చేస్తున్న నేతలు

ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన జిపిఎస్ గెజిట్‌ను ఉపసంహరించుకోని ఒపిఎస్ విధానాన్ని అమలు చేయాలని యుటిఎఫ్ జిల్లా సహ అధ్యక్షులు వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు నూజివీడు ప్రాంతీయ కార్యాలయం వద్ద ఆదివారం జిపిఎస్ ప్రతులు దహనం చేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పాత పెన్షన్ విధానం (ఒపిఎస్) పునరుద్ధరించాలని ఉద్యోగ, ఉపాధ్యాయులు కోరుతున్నా జిపిఎస్ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయడం దుర్మార్గమన్నారు. తక్షణమే ఆ నోటిఫికేషన్ రద్దు చేసి ఒపిఎస్ అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి బత్తుల అనురాధ, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు కాకాని గంగెయుడు, ముసునూరు మండలాధ్యక్షులు జి.పద్మకిషోర్, ప్రభాకరరావు, నాగరాజు, శ్రీనివాసరావు, జాకబ్, రాజు పాల్గొన్నారు.

పెరిగిన గోదావరి నీటిమట్టం

ప్రాజెక్టు స్పిల్ వే వద్ద గోదావరి నిటీమట్టం

ప్రజాశక్తి - పోలవరం

పోలవరంలో గోదావరి నీటిమట్టం ఆదివారం సాయంత్రానికి పెరిగింది. ఎగువ ప్రాంతాల్లో, ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాలకు గోదావరి ఉప నదులు శబరి, ఇంద్రావతి, సీలేరు, కిన్నెరసాని, మానేరు, ప్రాణహిత, మంజీరా, పూర్ణ, ప్రవరల నుంచి గోదావరిలో వరద జలాలు ప్రవహిస్తున్న నేపథ్యంలో నీటిమట్టం గత రెండు రోజులుగా క్రమక్రమంగా పెరుగుతుంది. స్పిల్‌వేలోకి వస్తున్న గోదావరి జలాలను ఎప్పటికప్పుడు 48 గేట్ల ద్వారా దిగువకు విడుదల చేయడంతో స్పిల్‌వేలో సాధారణ నీటిమట్టం మాత్రమే నమోదైంది. పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే ఎగువన 27.040 మీటర్లు, దిగువన 17.340 మీటర్లు, ఎగువ కాపర్ డ్యాంకి ఎగువన 27.300 మీటర్లు, దిగువ కాపర్ డ్యాంకి దిగువన 17.940 మీటర్లు నమోదైనట్లు ఇఇలు పి.వెంకటరమణ, మల్లికార్జునరావు తెలిపారు.

పట్టిసీమ నుంచి 5.310 క్యూసెక్కుల జలాలు విడుదల

పట్టిసీమ ఎత్తిపోతల పథకం నుంచి 5.310 క్యూసెక్కుల గోదావరి వరద జలాలను పోలవరం ప్రాజెక్టు కుడి కాలువకు విడుదల చేసినట్లు ఆ పథకం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పెద్దిరాజు తెలిపారు. పట్టిసీమలో గోదావరి నీటిమట్టం 15.538 మీటర్లకు చేరుకుందని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఐదు పంపులు నిలిపి 15 పంపులు 15 మోటార్లతో నీటిని విడుదల చేసినట్లు తెలిపారు.

కార్మికుడి కుటుంబానికి నష్ట పరిహారం చెల్లించాలి

ప్రజాశక్తి - ఏలూరు

ఉంగుటూరు మండలం ఎర్రమిల్లిపాడు సుగుణ ఫుడ్స్ ప్రయివేట్ లిమిటెడ్ పరిశ్రమలో పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు గాయపడి మృతి చెందిన బీహార్‌కి చెందిన వలస కార్మికుడు ధర్మేంద్రకుమార్ కుటుంబానికి రూ.50 లక్షల నష్ట పరిహారం చెల్లించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి ఆర్.లింగరాజు, డిఎన్‌విడి ప్రసాద్ డిమాండ్ చేశారు. సుగుణ ఫుడ్స్ పరిశ్రమలో ఈ నెల నాలుగో తేదీన లోడింగ్, ఆన్‌లోడింగ్ సమయంలో మేత బస్తాలు మీద పడి తీవ్ర గాయాలపాలైన ధర్మేంద్రకుమార్ గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఆదివారం ఉదయం మృతి చెందాడన్నారు. యాజమాన్యం తగిన భద్రతా చర్యలు తీసుకోకపోవడం వల్లనే ఈ ప్రమాదం సంభవించిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఫ్యాక్టరీస్ డిపార్ట్‌మెంట్ అధికారులు, కార్మిక శాఖ అధికారులకు పరిశ్రమలను తనిఖీ చేసే అధికారం లేకుండా చేయడం వల్ల యాజమాన్యాలు ఎటువంటి భద్రతా చర్యలు పాటించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. వలస కార్మికులు పని చేస్తున్న చోట యాజమాన్యాలు 12 గంటల పాటు ఏకధాటిగా పని చేయించడం, వారికి కనీస విశ్రాంతి ఇవ్వకపోవడం వల్ల అనేక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. ప్రతి ఏటా ప్రమాదాలు జరిగి అనేకమంది కార్మికులు మరణిస్తున్నారన్నారు. ఇప్పటికైనా భద్రతా చర్యలు పటిష్టంగా తీసుకోవాలని డిమాండ్ చేశారు. మరణించిన కార్మికుని కుటుంబానికి రూ.50 లక్షల నష్ట పరహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

అల్లూరి స్ఫూర్తితో పేదలకు సేవలు

ఘనంగా 'ఆశ్రం' రజతోత్సవ, ఛైర్మన్ గంగరాజు పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ



ఆశ్రం రజతోత్సవ, ఛైర్మన్ గంగరాజు పుట్టినరోజు వేడుకల్లో ఆసుపత్రి యాజమాన్యం

ఆశ్రం హాస్పిటల్స్ స్థాపించి 25 ఏళ్లు అయిన సందర్భంగా రజతోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా ప్రారంభించారు. ఆశ్రం హాస్పిటల్ స్థాపించిన గోకరాజు గంగరాజు పుట్టినరోజు ఇదే రోజు కావడంతో ఆ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆశ్రం హాస్పిటల్‌లో పనిచేస్తున్న పూర్వ విద్యార్థులు, అధ్యాపకులు, ప్రొఫెసర్లు, డాక్టర్లు గోకరాజు గంగరాజుకు శాలువాలు కప్పి సన్మానం చేశారు. అనంతరం కేక్ కటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రం కాలేజీ ప్రిన్సిపల్ శ్రీనివాస్ మాట్లాడుతూ నాణ్యమైన వైద్య విద్యను అందించడం, సమాజానికి సేవ చేయడమే లక్ష్యంగా ఆశ్రం కాలేజీని గంగరాజు స్థాపించారని తెలిపారు. ఆశ్రం హాస్పిటల్ డైరెక్టర్ రతిదేవి మాట్లాడుతూ ఆశ్రం కాలేజీ స్థాపించిన నాటి నుంచి ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొందని, కష్ట సమయాల్లో నిలబడిన ప్రతి ఒక్క ఉద్యోగికి ధన్యవాదాలు తెలుపుతున్నానని చెప్పారు. కాలేజీ స్థాపించినప్పుడు ఎంబిబిఎస్ కోర్సుకు వంద సీట్లు మాత్రమే ఉండేవని, ఈరోజు 250 సీట్లకు పెరిగిందని సంతోషం వ్యక్తం చేశారు. ఇక్కడ చదివిన ఎంతో మంది విద్యార్థులు ప్రపంచవ్యాప్తంగా వైద్య సేవలందిస్తున్నారని తెలిపారు. వారు కష్టాల్లో ఉన్నప్పుడు అండగా నిలబడిన సిఇఒ హనుమంతరావుకు ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు. సిఇఒ హనుమంతరావు మాట్లాడుతూ సమాజానికి సేవ చేయడమే లక్ష్యంగా గోకరాజు గంగరాజు ఆశ్రం హాస్పిటల్‌ను ప్రారంభించారని, ఎన్ని ఒడిదుడుకులు వచ్చినా ఆయన వెనకడుగు వేయలేదని చెప్పారు. ఆయన మంచితనమే ఆశ్రం హాస్పిటల్ ఎదుగుదలకు దోహద పడిందన్నారు. ఆశ్రం కాలేజీ స్థాపించి నేటికి 25 సంవత్సరాలు పూర్తి చేసుకుందని తెలిపారు. రజతోత్సవ వేడుకలను నేటి నుంచి 2025 జులై వరకు నిర్వహిస్తామని తెలిపారు. గోకరాజు గంగరాజు మాట్లాడుతూ ఆశ్రం కాలేజీతో పాటు జిల్లా వ్యాప్తంగా ఎన్నో విద్యాసంస్థల ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రతిఒక్కరూ క్రమశిక్షణ, నీతి నిజాయితీతో ఉన్నప్పుడే ఎంతో ఉన్నత స్థాయికి ఎదుగుతారన్నారు. స్వాతంత్ర సమరయోధుడు అల్లూరి సీతారామరాజు స్ఫూర్తితో పేదలకు సేవ చేయాలనే సంకల్పంతో సంపదను పదిమందికి పంచడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ సందర్భంగా సిఇఒ హనుమంతరావు విలేకర్లతో మాట్లాడుతూ ఆశ్రం వ్యవస్థాపకులు, ఛైర్మన్ గోకరాజు గంగరాజు పుట్టినరోజు వేడుకలకు విచ్చేసిన మాజీ ఎంపీ కనుమూరి బాపురాజుకు, విచ్చేసిన ముఖ్య అతిథులకు, కాలేజీ సిబ్బందికి, విద్యార్థులందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

బండిరేవు వంతెన నిర్మించాలని ఎంఎల్ఎకు వినతి

ప్రజాశక్తి - టి.నర్సాపురం

ఎంఎల్ఎకు వినతిపత్రం అందిస్తున్న గ్రామస్తులు, రైతుల

మండల కేంద్రమైన టి.నర్సాపురం నుండి కొమ్ముగూడెం వెళ్లే రహదారికి మరమ్మతులు చేయించి బండిరేవు వద్ద ఎర్రకాల్వపై వంతెన నిర్మించాలని టి.నర్సాపురం గ్రామస్తులు, రైతులు పోలవరం ఎంఎల్ఎ బాలరాజును కోరారు. ఈ మేరకు వారు ఆదివారం ఎంఎల్ఎ చిర్రి బాలరాజును ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక రైతులకు చెందిన వందలాది ఎకరాలు ఆయకట్టుకు వెళ్లేందుకు కొమ్ముగూడెం రోడ్డే ఆధారమని, ఆ రోడ్డు అధ్వానంగా ఉండటం, వంతెన లేకపోవడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. సాగుకు అవసరమైనవి తీసుకెళ్లడానికి, పంట తీసుకురావడానికి నానావస్థలు పడుతున్నామని వాపోయారు. నందమూరి విద్యాసాగర్ ప్రాజెక్టు చెరువు పొంగినప్పుడల్లా వరద నీరు ప్రవాహం పెరగడంతో రాకపోకలు నిలిచిపోతున్నాయని, వంతెన లేకపోవడం చాలా ఇబ్బందికరంగా ఉందని తెలిపారు. గతంలో నీటి ప్రవాహానికి కొన్ని పశువులు మృతి చెందిన సందర్భాలు ఉన్నాయని, రోడ్డు అభివృద్ధి చేసి వంతెన నిర్మించి సమస్య పరిష్కరించాలని ఎంఎల్ఎకు విన్నవించారు. దీనిపై స్పందించిన ఎంఎల్ఎ బాలరాజు మాట్లాడుతూ నాలుగు నెలల్లో వంతెన పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రైతులు కొనకళ్ల మోహన్, యలమంచి వాసు, దేవరపల్లి రంగారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ

ప్రజాశక్తి - ఏలూరు

కలెక్టర్ ఆదేశాల మేరకు 15వ తేదీ సోమవారం ఉదయం పది గంటలకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం నిర్వహించనున్నారు. కలెక్టర్ కార్యాలయంలోని గోదావరి సమావేశ మందిరంలో ఈ కార్యక్రమంలో నిర్వహించనున్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

కీలక నామినేటెడ్ పదవి రేసులో ఫణిబాబు?

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

జనసేన నూజివీడు నియోజకవర్గ సమన్వయకర్త బర్మా ఫణిబాబు ఆ పార్టీ అధిష్టానం కీలకమైన నామినేటెడ్ పదవిని ఇవ్వనున్నట్లు జనసేన వర్గాలు తెలియజేస్తున్నాయి. జనసేన పార్టీ నూజివీడు నియోజకవర్గంలో బలోపేతం అవ్వడానికి ఆర్థికంగా, సామాజికంగా పార్టీని సమన్వయం చేసుకుంటూ కూటమి పొత్తులో భాగంగా ఎంఎల్ఎ సీటు రాకపోయి యినా జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు కూటమి అభ్యర్థి గెలుపు నకు బర్మా ఫణి బాబు, జనసైనికులు పూర్తిస్థాయిలో పనిచేయడంతో నూజివీడు నియోజకవర్గంలో కూటమి గెలుపులో కీలకపాత్ర పోషించారు. ఆయన మెగా కుటుంబంపై అభిమానంతో 2009లో చిరంజీవి పెట్టిన ప్రజారాజ్యం పార్టీలో చేరి నూజివీడు నియోజకవర్గ వ్యాప్తంగా అనేక సేవ కార్యక్రమాలు చేసి ఎంఎల్ఎ సీటు కోసం పోటీలో ఉన్నా కూడా ప్రజారాజ్యం పార్టీ సీటు వేరే వారికి ఇచ్చింది. ప్రజారాజ్యం పార్టీలో ఉంటూ ప్రజారాజ్యం కాంగ్రెస్లో విలీనమయ్యాక వేరే పార్టీలోకి వెళ్లకుండా స్తబ్దుగా ఉండి పవన్కళ్యాణ్ స్థాపించిన జనసేన పార్టీలో చేరి నియోజకవర్గంలో జనసేన పార్టీకి ఆర్థికంగా వెన్నుదన్నుగా ఉన్నారు. జనసేన అధిష్టానం నిర్ణయానికి కట్టుబడి ఎంఎల్ఎ సీటు తనకి ఇవ్వకపోయినా కూటమి గెలుపునకు బర్మా ఫణిబాబు కృషి చేశారు. అలాంటి వ్యక్తికి నామినేటెడ్ పదవి ఇచ్చి తగిన గౌరవం ఇవ్వాలని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. జనసేన అధిష్టానం బర్మా ఫణి బాబుకు మంచి గుర్తింపు ఉన్న నామినేటెడ్ పదవి ఇస్తుందని జన సైనికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

వంతెన కానాలకు దట్టంగా పట్టిన గుర్రపు డెక్క

నీటి ప్రవాహానికి అడ్డంకిగా గుర్రపు డెక్క

ప్రజాశక్తి - ముదినేపల్లి

పోల్రాజ్ కాలువ ద్వారా సరఫరా అవుతున్న తాగునీటి ప్రవాహానికి గుర్రపు డెక్క, పలుచోట్ల కాలువలో అడ్డంకిగా మారింది. రెండురోజుల క్రితం పోల్రాజ్ కాలువకు జలవనరుల శాఖాధికారులు తాగు నీటిని విడుదల చేశారు. అయితే ఎగువ నుంచి వచ్చే నీటితో పాటుగా గుర్రపు డెక్క కూడా భారీగా నీటి ప్రవాహంలో కొట్టుకొస్తుంది. ఇలా కొట్టుకొస్తున్న గుర్రపు డెక్క కాలువలపై నిర్మించిన వంతెన కానాలకు దట్టంగా పట్టేయడంతో నీటి ప్రవాహానికి అడ్డంకిగా తయారైంది. ముదినేపల్లిలోని కలిబూటు వంతెన వద్ద, అలాగే పలుచోట్ల వంతెనల వద్ద కానాలకు గుర్రపు డెక్క దట్టంగా పట్టేయడంతో తాగునీరు దిగువకు సరఫరా అయ్యేందుకు అవరోధంగా మారింది. దీంతో నీటిపారుదలశాఖ శివారు గ్రామాలకు తాగునీరు అందే పరిస్థితి లేకుండా పోతుంది. జల వనరుల శాఖాధికారులు వెంటనే స్పందించి కాలువల వంతెన వద్ద కానాలకు పట్టిన గుర్రపు డెక్కను వెంటనే తొలగించాలని మండల రైతులు కోరుతున్నారు.



పురస్కారం అందుకుంటున్న కుసుమలత

కైకరం జెడ్పిహెచ్ స్కూల్ విద్యార్థికి రాష్ట్రస్థాయి అవార్డు

ప్రజాశక్తి - ఉంగుటూరు

తాటిచెట్ల తోట సాగు-ఒక భవిష్యత్తు నూతన వ్యవసాయ విధానంపై ప్రాజెక్టు చేసిన ఉంగుటూరు మండలం కైకరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని నెరుసు కుసుమలత రాష్ట్ర స్థాయి పురస్కారం అందుకుంది. దీనికి సంబంధించి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి.ప్రసాదరావు వివరాలు వెల్లడించారు. విద్యార్థుల్లో అంతర్గతంగా దాగి ఉన్న ప్రతిభా పాటవాలు, శాస్త్రీయ నైపుణ్యాలను వెలికితీసి వారిని ప్రోత్సహించడానికి డాక్టర్ కెవి.రావు శాస్త్రీయ సొసైటీ 24వ వార్షిక సైన్స్ పురస్కారాలు నిర్వహించారు. దీంతో 2023 డిసెంబర్ 13వ తేదీన కుసుమలత తాటి చెట్ల తోట సాగుతో కలిగే లాభాలను వివరిస్తూ ప్రాజెక్టు రిపోర్టును తయారు చేసి నిర్వాహకులకు పంపించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇలా 180 మంది విద్యార్థులు వివిధ ప్రాజెక్టులను తయారు చేసి వాటిని ప్రదర్శించగా వాటిలో జిల్లాకు ఒకటి చొప్పున 26 ప్రాజెక్టులను పురస్కారాలకు ఎంపిక చేశారు. గైడ్ కూనాతి జాన్ పర్యవేక్షణలో కుసుమలత రూపొందించిన తాటిచెట్ల తోట సాగు భవిష్యత్తు నూతన వ్యవసాయ విధానం ప్రాజెక్టు ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ క్రమంలో శనివారం రాత్రి హైదరాబాదులో జరిగిన కార్యక్రమంలో నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ డైరెక్టర్ ప్రియాఅబ్రహం, జయకర్ ఎంటర్ ప్రైజెస్ జెఎండి పార్థోకర్ చేతుల మీదుగా పురస్కారాన్ని అందించారని హెచ్ఎం గుళ్ల ప్రసాదరావు వెల్లడించారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు కృషి

పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

అర్హులైన జర్నలిస్టులందరికీ టిడిపి కూటమి ప్రభుత్వంలో ఇళ్ల స్థలాలు ఇవ్వడంతో ఇల్లు కట్టించి ఇస్తామని పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు అన్నారు. పట్టణంలో ఎపియుడబ్ల్యూజె సమావేశం ఆదివారం నిర్వహించారు. ఎలక్ట్రానిక్ మీడియా తొలి కార్యవర్గ సమావేశాన్ని చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్కుమార్, పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ చిర్రి బాలరాజు మాట్లాడుతూ ప్రపంచంలో ఏం మూలన ఏం జరిగినా అది మనకు నిమిషాల్లో తెలుస్తుందంటే అది కేవలం మీడియా ద్వారానే అన్నారు. అటువంటి మీడియా నేడు కష్టాల్లో ఉందన్నారు. టిడిపి కూటమి ప్రభుత్వంలో అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు, ఇల్లు కట్టించే బాధ్యత తాము తీసుకుంటామని హామీ ఇచ్చారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం తన వంతు సహాయంగా రూ.50 వేలు ఇస్తానని ప్రకటించారు. పోలవరం నియోజకవర్గంలో ఏదైనా సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

తండ్రి మరణాన్ని జీర్ణించుకోలేక కుమార్తె ఆత్మహత్య

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

తండ్రి మరణాన్ని జీర్ణించుకోలేని బాలిక ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఏలూరు నగరంలో ఆదివారం చోటు చేసుకుంది. ఏలూరు రెండో పట్టణ ఎస్ఐ మదీనాబాష తెలిపిన వివరాల ప్రకారం... ఏలూరు నగరంలోని తంగెళ్లమూడి శివారు గోపాలపురం ప్రాంతానికి చెందిన కుసుమూరు దుర్గారావు స్థానికంగా హెయిర్ కటింగ్ సెలూన్ నిర్వహిస్తూ జీవిస్తున్నాడు. ఇతనికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఈ క్రమంలో ఈ ఏడాది మార్చి నెలలో దుర్గారావు గుండెపోటుతో తాను పనిచేస్తున్న దుకాణంలోనే మృతి చెందాడు. దుర్గారావు కుమార్తె కుసుమూరి అనుష్క (16) స్థానికంగా సెయింట్థెరీసా కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతుంది. తండ్రి చనిపోయిన విషయాన్ని జీర్ణించుకోలేని ఆమె గత కొంతకాలంగా ఎంతో మదనపడుతూ ఉంటుంది. ఈ క్రమంలో ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. సమాచారం తెలుసుకున్న ఏలూరు రెండో పట్టణ ఎస్ఐ మదినాబాష ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బాలిక మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

డ్రెయినేజీ నిర్మించండి మహాప్రభో..!

మురుగునీటిలో నడవలేకపోతున్నాం
ఎస్సి కాలనీ వాసుల ఆవేదన
దోమల వ్యాప్తితో రోగాల బారిన పడతామని భయాందోళన
అధికారులు స్పందించాలని వేడుకోలు

ప్రజాశక్తి - మండవల్లి

అపరిశుభ్ర రోడ్లపై మురుగు మిళితమే ఎస్సి కాలనీ. పాలకుల నిర్లక్ష్యం, అధికారుల ఉదాశీనత ఎస్సి కాలనీవాసులకు శాపంగా మారింది. దీంతో దుర్వాసనల నడుమ ఏళ్ల తరబడి మురుగులోనే రాకపోకలు సాగిస్తున్న పరిస్థితులు నెలకొన్నాయి. మంచాల కాలనీలో అభివృద్ధి శిలాఫలకానికే నోచుకోవడంతో చినుకు పడితే రోడ్లపై నీళు నిలిచిపోయి దోమలు వ్యాప్తి చెంది వ్యాధుల బారిన పడుతున్నామని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

1986 అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ స్థలాలను పంపిణీ చేసి నివాసాలు ఏర్పాటు చేయడంతో ఎస్సి కాలనీగా ఏర్పడింది. సుమారు 150 కుటుంబాలకు చెందిన సుమారు 750 మంది కూలినాలి పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. పెరిగిన కుటుంబాలకు తగిన విధంగా డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగునీరు నిత్యం రోడ్డుపైనే నిలవడంతో ఏళ్ల తరబడి ఆ మురుగులోనే రాకపోకలు సాగించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. రోడ్లు లోతట్టుగా ఉండడంతో చిన్న చినుకు పడితే రహదారులు చెరువులను తలపిస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఆ నీటిలో పాముల సంచారంతో పాటు దోమల వ్యాప్తి చెంది నిత్యం రోగాల బారిన పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏళ్ల తరబడి మురుగునీరు రోడ్డుపైనే ఉండడంవల్ల పాకుడు పట్టి జారి పడుతున్న ఎవరూ పట్టించుకోవడంలేదని వాపోతున్నారు.

దయనీయ పరిస్థితిలో మంచాల కాలనీ

దశాబ్దాలపాటు మురుగునీటి మధ్య మంచాల కాలనీ వాసులు సహజీవనం చేయాల్సిన దయనీయ పరిస్థితులు నెలకొన్నాయి. మంచం తయారు చేస్తేనే తప్ప పొయ్యి వెలిగని పరిస్థితి. ప్రభుత్వాలు, పంచాయతీ పాలన మారినా వారి బతుకులు మారడం లేదని ఆవేదన చెందుతున్నారు. జాతీయ రహదారి పక్కన లోతట్టు ప్రాంతంలో ఆ పేద కుటుంబాలు మురుగునీటిలోనే నివాసాలు ఉంటున్నా నాయకులు, పాలకులు కన్నెత్తి చూడని పరిస్థితి. కాలనీలో డ్రెయినేజీ సౌకర్యం లేకపోవడంతో చిన్నపాటి చినుకు పడితే మురుగు వర్షపునీటిలో కలిసి రహదారితో పాటు నివాసాలను ముంచెత్తుతుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మురుగు పక్కన మంచాలు తయారు చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. మురుగు దుర్వాసన వెదజల్లడంతో ప్రాణాంతక వ్యాధులు సంభవిస్తాయేమోనని భయాందోళన చెందుతున్నారు. కాలంతో సంబంధం లేకుండా మురుగు నివాసాల మధ్య నిల్వ ఉండడం, పందుల సంచారంతో దోమలు వృద్ధి చెందడంతో తరచూ రోగాల బారిన పడుతున్నామని కాలనీవాసులు వాపోతున్నారు. ప్రజాశక్తి యంత్రాంగం పర్యటించి సమస్యను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో మంచాల కాలనీకి రహదారి ఏర్పడిందని తదుపరి డ్రెయినేజీ ఏర్పాటు చేయలేదని స్పష్టం చేస్తున్నారు. 2020 జనవరి 6న సుమారు రూ.14 లక్షలతో మంచాల కాలనీలో అభివృద్ధి చేసేందుకు శిలాఫలకాన్ని వేసి నాలుగేళ్లు గడుస్తున్నా అభివృద్ధి జరగలేదని వారు చెబుతున్నారు. జిల్లా అధికారులు స్పందించి కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంతోపాటు పేద కుటుంబాలకు ఆర్థిక చేయూతనివ్వాలని వారు ముక్తకంఠంతో వేడుకుంటున్నారు.

రోడ్డుపై ఉన్న చూపుతున్న ఎస్సి కాలనీవాసులు

మురుగునీటిలో నడవలేకపోతున్నాం

బుద్దుల చంటి

రోడ్డుపైకి చేరుకున్న మురుగు నీటిలో నడవలేకపోతున్నాం. కాళ్లు పాచిపోయి దురదలు వస్తున్నాయి. బురద పేరుకుపోయి నడుస్తూ జారి పడుతున్నాం. ఎవరూ పట్టించుకోవడం లేదు. ఎవరికి చెప్పుకోవాలో తెలియడం లేదు. రోగాల బారిన పడతామోనని భయంగా ఉంది.

అధికారులు స్పందించాలి

బుద్దుల లక్ష్మీదేవి

నివాసాల మధ్య మురుగు నిత్యం ఉంటుంది. దానికి తోడు దుర్వాసన వస్తుంది. దోమలు పెరిగి రాత్రి వేళల్లో కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. దోమల వల్ల రోగాల బారిన పడతామోనని భయంగా ఉంది. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకుని మా సమస్యలను పరిష్కరించాలి.

జార్జిపేటలో తాగునీటి సమస్య పరిష్కారం

ఎంఎల్ఎ రోషన్కుమార్కు గ్రామస్తుల కృతజ్ఞతలు

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్కుమార్ చొరవతో మండలంలోని జార్జిపేట గ్రామంలో ఎన్నో ఏళ్ల నుంచి ఉన్న తాగునీటి సమస్య పరిష్కారమైంది. జార్జిపేట గ్రామంలో తాగునీటి సమస్య ఉందని ఎంఎల్ఎ సొంగా రోషన్కుమార్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన ఆదేశాల మేరకు గ్రామంలో ఆదివారం డ్రిల్ బోర్ వేయించారు. దీంతో నీరు పడినందుక జార్జిపేట గ్రామస్తులందరూ ఆనందం వ్యక్తం చేశారు. ఎంఎల్ఎ సొంగా రోషన్కుమార్కి కృతజ్ఞతలు తెలిపారు. టిడిపి గ్రామ కమిటీకి, సహకారం అందించిన సర్పంచి భూపతికి కృతజ్ఞతలు తెలిపారు.

రాధాకృష్ణారెడ్డి ఉద్యోగ విరమణ సభ

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు, పలు జిల్లాల్లో పోలీసు శాఖలో విశేష సేవలందించిన సబ్ ఇన్స్పెక్టర్ రాధాకృష్ణారెడ్డి ఉద్యోగ విరమణ మహోత్సవ కార్యక్రమం నూజివీడు పట్టణంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నూజివీడు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి పోలీస్ శాఖలోని అధికారులు, సిబ్బంది, నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పోలీస్ శాఖలో విశేష సేవలందించిన రాధాకృష్ణారెడ్డిని అధికారులు, పోలీస్ సిబ్బంది, నాయకులు అభినందించారు.

నాట్లు వేసే పనిలో రైతులు

ప్రజాశక్తి - చింతలపూడి

మండలంలో కురుస్తున్న వర్షాలకు రైతులందరూ వరి నాట్లు వేసే పనిలో నిమగ్నమయ్యారు. చెరువులు, కాలువలు నిండిపోవడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గతంలో కంటే కొంచెం ఆలస్యమైనా వరినట్లు వేయడానికి కావాల్సినంత నీరు రావడంతో ఇబ్బంది లేదని రైతులు చెబుతున్నారు. ఇప్పటికే చింతలపూడి మండలంలో 40 శాతం వరినాట్లు పూర్తయ్యాయని చెబుతున్నారు.

గురుకుల పాఠశాలకు శాశ్వత భవనాలు నిర్మించాలి

ఎంఎల్ఎ చింతమనేనికి పిడిఎస్యు వినతి

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

పెదవేగి మండలం వంగూరు గ్రామంలో అద్దె భవనంలో నిర్వహిస్తున్న గురుకుల పాఠశాలకు స్థలం కేటాయించి శాశ్వత భవనాలు నిర్మించాలని కోరుతూ పిడిఎస్యు జిల్లా అధ్యక్షుడు కాకి నాని ఆధ్వర్యంలో దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా కాకి నాని మాట్లాడుతూ పెదవేగి మండలం వేగవరం గ్రామంలో ఉన్న హేళాపురి ఇంజినీరింగ్ కళాశాలకు సంబంధించిన భవనాల్లో అద్దెకు 2017లో ఈ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలను ప్రారంభించినట్లు తెలిపారు. ఇన్ని సంవత్సరాలు అవే భవనాల్లో తరగతులు హాస్టల్ అరకొర వసతులతో కాలం వెల్లదీశారన్నారు. అయితే గత ఐదు నెలల క్రితం హేలాపురి కళాశాల యాజమాన్యం గురుకుల పాఠశాల ఉన్న భవనాలను ఖాళీ చేయమని చెప్పిన నేపథ్యంలో పాఠశాల ప్రిన్సిపల్, సిబ్బందిపై అధికారుల ఆదేశాలతో అనేక ప్రయివేట్ భవనాలు వెతికి ఆఖరికి వంగూరు గ్రామంలో ఉన్న పాత ఒక ప్రయివేట్ కళాశాలకు సంబంధించిన భవనంలోకి గురుకుల పాఠశాలను మార్చినట్లు చెప్పారు. అయితే అక్కడ కూడా చాలీచాలని తరగతి గదిలోనే విద్యార్థులు చదువుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని, పంటపొలాల మధ్యలో పాఠశాల ఉండటంవల్ల పాముల బెడద ఉంటుందని నాని ఆందోళన వ్యక్తం చేశారు. దాదాపు 240 మంది విద్యార్థులు ఉన్న పాఠశాలలో ఒక్క ప్రిన్సిపల్ మినహా మిగతా టీచింగ్ అండ్ నాన్ టీచింగ్ సిబ్బంది అంతా పార్ట్ టైం, కాంట్రాక్ట్ సిబ్బంది కావడం వల్ల విద్యార్థులు తీవ్రమైన ఇబ్బందులకు గురవుతున్నారు. విద్యార్థుల పట్ల దయ ఉంచి గురుకుల పాఠశాలకు స్థలం కేటాయించి శాశ్వత భవనాలు నిర్మించే విధంగా చర్యలు తీసుకుని విద్యార్థుల భవిష్యత్తు కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎం.క్రాంతి, సి.యశ్వంత్, యు.చందన్, ఐ.విజయ్ పాల్గొన్నారు.

తాగునీటి అవసరాలకు తొలి ప్రాధాన్యత

ప్రజాశక్తి - కైకలూరు

ప్రభుత్వం కాలువలకు సరఫరా చేసిన నీటిని తాగునీటి అవసరాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఎంఎల్ఎ కామినేని శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని వింజరంలో పంట కాలువ లాకులు వద్ద తాగు నీరు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు గ్రామాల్లో మంచి నీటి చెరువులకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ప్రతి మంచినీటి చెరువు నిండేలా తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టిడిపి కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అడుగడుగునా గుంతలు.. ఆందోళనలో ప్రజలు

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలవ్యాప్తంగా ఏ రోడ్డు చూసిన అధ్వానంగా, భయంకరంగా తయారయ్యాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు రోడ్లపై ఏర్పడ్డ భారీ గుంతల్లో నీరు చేరి రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి. ఇది రోడ్డా లేక అనే చెరువా అనే అనుమానం జనాలకు కలుగుతోంది. గత ప్రభుత్వం రోడ్లను పట్టించుకోకపోవడంతో పరిస్థితి దారుణంగా తయారైంది. వర్షం కురిస్తే ఎక్కడ గుంత ఉందో తెలియని పరిస్థితి. అడుగుకో గొయ్యి చొప్పున రోడ్లు అధ్వానంగా మారాయి. మండలంలోని ముదినేపల్లి-బంటుమిల్లి రోడ్డులో వడాలి ప్రధాన సెంటర్ వద్ద, స్తంభం చెరువు వద్ద, వడాలి-తామరకొల్లు రోడ్డులో, ముదినేపల్లి-గుడ్లవల్లేరు రోడ్డులో ముదినేపల్లి, గురజ వద్ద, గుడివాడ, కైకలూరు రోడ్డుల్లో పలు గ్రామాల వద్ద రోడ్లపై ఏర్పడ్డ భారీ గోతులతో జనం అనేక ఇబ్బందులు పడుతున్నారు. కొత్తగా ఏర్పడ్డ కూటమి ప్రభుత్వం రోడ్ల సమస్యపై దృష్టి సారించి కనీసం మరమ్మతులైనా చేపట్టాలని మండలంలోని వాహనదారులు, ప్రజలు సంబంధిత శాఖ అధికారులను కోరుతున్నారు.

వడాలి ప్రధాన సెంటర్లో రోడ్డుపై ఏర్పడ్డ భారీ గుంతలు

20 మంది ఆటో డ్రైవర్లు సిఐటియులో చేరిక

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరు నగరం, చొదిమెళ్ల ఆటోస్టాండ్లోని డ్రైవర్లు 20 మంది ఆదివారం సిఐటియులో చేరారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో జరిగిన జనరల్బాడీలో సిఐటియులో చేరిన ఆటో డ్రైవర్లకు జిల్లా ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బి.సూరిబాబు, జె.గోపీ అభినందించారు. ఆటో డ్రైవర్ల సమస్యలపై సిఐటియు అనేక సమరశీల పోరాటాలు నిర్వహించిందని తెలిపారు. డ్రైవర్లంతా ఆటో రికార్డులు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, ప్రయాణికులతో స్నేహపూర్వకంగా మెలగాలని విజ్ఞప్తి చేశారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, ప్రతి ఒక్కరూ యూనిఫాం ధరించాలని కోరారు. ఏలూరు నగరంలో సీసీ కెమెరాల ద్వారా విధించిన ఇ-చలానాలను రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిత్యం ప్రయాణికులకు సేవలందిస్తూ, ప్రమాదాల అంచున జీవనం సాగిస్తున్న ఆటో డ్రైవర్లకు రక్షణ కల్పించేలా సంక్షేమ బోర్డును రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో వై.బాలాజీ, జి.డేవిడ్రాజు, వి.దుర్గారావు, ఎల్.వెంకటేశ్వరరావు, సిహెచ్.ప్రసాదరావు, ఎస్.చినబాబు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జె.గోపీ

ప్రత్యేక అవసరాల పిల్లలకు అండగా ఉంటాం

ఐఆర్టి ఉపాధ్యాయులు లక్ష్మీనారాయణ, నాగమల్లేశ్వరి

ప్రత్యేక అవసరాల పిల్లలతో ఐఆర్టి ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - ముసునూరు

ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఎల్లప్పుడూ అండగా ఉంటూ వారి ఆరోగ్యంతో పాటు మానసికంగా, శారీరకంగా కూడా ఆరోగ్యకరంగా ఉండడానికి తాము తోడ్పాటు అందిస్తున్నామని ఐఆర్టి ఉపాధ్యాయులు డిఎంవి.లక్ష్మీనారాయణ, జె.నాగమల్లేశ్వరి తెలిపారు. ఈ సందర్భంగా వారు ఆదివారం మాట్లాడుతూ మండలంలోని 16 గ్రామాల్లో ప్రత్యేక అవసరాలు గల పిల్లలు ఎవరైనా ఉంటే ఈ నెల మొదటి వారంలో ఎంఇఒ బివి.సుబ్బారావు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించినట్లు చెప్పారు. భవిత సెంటర్ నిర్వహించి ఫిజియోథెరపిస్టు జి.ప్రశాంతి ఆధ్వర్యంలో వారంలోని ప్రతి మంగళవారం క్యాంపు నిర్వహించి పిల్లలతో పాటు వారి తల్లిదండ్రులకు కూడా అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. డిసెంబర్ మూడో తేదీన అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం నిర్వహించి, ఆ రోజున వికలాంగులకు ప్రత్యేక ఆటలు, పాటలు, చిత్రలేఖనం, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి మండలస్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులచే బహుమతి ప్రదానం చేయనున్నట్లు చెప్పారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని కోమర్రు ఎలిమెంటరీ పాఠశాల పూర్వ విద్యార్థి, పారిశ్రామికవేత సమ్మెట నాగేశ్వరరావు, ప్రవీణ దంపతులు స్కూల్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్స్ను అందించారు. పాఠశాలలో బడి రుణం తీర్చుకుందాం అనే కార్యక్రమం కింద విద్యార్థులకు పుస్తకాలు, పలకలు, ప్యాడ్లు ఇతర మెటీరియల్స్ను అందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రెడ్డి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో గ్రామ సర్పంచి కూనపరెడ్డి సాయికృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వర్షమొస్తే అవస్థలే..!

ప్రజాశక్తి - కామవరపుకోట

మడుగుగా జగనన్న లే అవుట్
లబ్ధిదారుల ఆవేదన

వర్షం పడితే ఆ లే అవుట్లో గృహాలు నిర్మించుకుని నివాసం ఉంటున్న వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలోని వీరిశెట్టిగూడెం గ్రామంలో అడ్డరోడ్డు వద్ద సుమారు 70 మంది వరకు లబ్ధిదారులకు జగనన్న లే అవుట్లో ఇంటి స్థలాలు ఇచ్చారు. వారిలో 38 మందికి పైగా లబ్ధిదారులు అక్కడ గృహాలు నిర్మించుకుని కుటుంబాలతో నివాసం ఉంటున్నారు. వర్షం వస్తే లే అవుట్ మొత్తం మడుగుగా మారిపోతుందని వారు వాపోతున్నారు. వాతావరణం సాధారణంగా ఉన్నప్పుడే వాడుకున్న మురుగు నీరు బయటకు వెళ్లేందుకు డ్రెయినేజీ లేదని, ఇంకా వర్షం వస్తే పరిస్థితి అధ్వానంగా ఉంటుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నడిచేందుకు కనీసం రోడ్డు కూడా సరిగా లేదని వాపోతున్నారు. వర్షం కురిసిన సమయంలో లే అవుట్లో నీరు నిలిచిపోవడంతో ఇంట్లో నుంచి బయటకు రాలేని పరిస్థితి నెలకొంటుందన్నారు. నీరు నిల్వ ఉండటం వల్ల సీజనల్ వ్యాధులకు గురయ్యే అవకాశం ఉందని భయాందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు, పాలకులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

రోడ్డుపై నిల్వ ఉన్న వర్షపు నీరు

తడి, పొడి చెత్త డస్ట్బిన్లు అందజేత

ప్రజాశక్తి - నిడమర్రు

మండలంలోని పత్తేపురం గ్రామంలో ప్రతి ఇంటికి తడి, పొడి చెత్త డస్ట్బిన్లను ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు పంపిణీ చేశారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించేందుకు వీటిని అందించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ ధర్మరాజు మాట్లాడుతూ పర్యావరణాన్ని, గ్రామాలను కాలుష్యం నుంచి పరిరక్షించడం చెత్త నుంచి సంపద సృష్టించడమే ఉప ముఖ్యమంత్రి పవన్కళ్యాణ్ లక్ష్యమన్నారు. ప్రతిఒక్కరూ స్వచ్ఛతపై దృష్టి సారించాలన్నారు. పంచాయతీ సిబ్బంది కూడా ఎప్పటికప్పుడు చెత్త సేకరణ చేయాలని సూచించారు. తడి, పొడి చెత్తపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి నీలపాల సాయిప్రియా, ఉప సర్పంచి కొండా రాజు, జనసేన, టిడిపి, బిజెపి నేతలు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన టిడిపి నేతలు

ప్రజాశక్తి - ద్వారకా తిరుమల

టిడిపి రాష్ట్ర అధ్యక్షులుగా నియమితులైన పల్లా శ్రీనివాసరావును, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ను మంగళగిరిలో టిడిపి గోపాలపురం నియోజకవర్గ తెలుగు మహిళా కార్యనిర్వహక కార్యదర్శి పొనుకుమాటి శ్రీసంధ్య, ద్వారకాతిరుమల మండల సీనియర్ నాయకులు కొత్తపల్లి సుబ్బారావు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. వారితో పాటు యంత్రపాటి తిరుమల, టిడిపి యువ కార్యకర్తలు యంత్రపాటి శివాజీ, యంత్రపాటి నరేంద్ర, కొత్తపల్లి కిషోర్, కొత్తపల్లి నవీన్ కుమార్ ఉన్నారు.

ఎపిఆర్సిఇటిలో చంద్రశేఖర్ ప్రతిభ

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ఆంధ్రప్రదేశ్ రీసెర్చ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ 2023-24 ఫలితాల్లో ఆర్జియుకెటి నూజివీడు క్యాంపస్లో కంప్యూటర్ సైన్స్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్గా, పరిపాలన అధికారిగా విధులు నిర్వహిస్తున్న టి.చంద్రశేఖర్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. 142 మార్కులు సాధించి ఎపిఆర్సిఇటి కంప్యూటర్ సైన్స్ విభాగంలో ఒకటో ర్యాంకు సాధించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ను ఆర్జియుకెటి అధికారులు, సహ ఉపాధ్యాయులు అభినందించారు.

పాస్పోర్టు పోయినది

ప.గో.జిల్లా, పాలకొల్లు పట్టణంకు చెందిన విపర్తి శాంతి, భర్త: రమేష్, డోరు నెం. 44-3-5, వెలమగూడెం, పాలకొల్లు నివాసి అయిన నేను **22-6-2024** తేదీన పాలకొల్లులో ఇల్లు మారు తుండగా పాలకొల్లులో పై డోర్ నెంబర్ లో నా యొక్క ఒరిజినల్ పాస్ పోర్టు పోయినది. నా పాస్ పోర్ట్ నెంబర్ **P5227926**. నేను వైజాగ్ లో **27-1-2017**న పొందాను. నేను ఎంతవెతికినా నా ఒరిజినల్ పాస్ పోర్ట్ దొరకలేదు. కాబట్టి ఎవరికైనా దొరికిన నాకు అందజేయవలసినదిగా కోరి ప్రార్థించుచున్నాను.

ఫోన్ నెంబర్ 9989270822

ప్రకటన

మహారాజశ్రీ ప్రిన్సిపాల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్), భీమవరం వారి కోర్టులో

O.S.No.104/2021

యర్రంశెట్టి వెంకట లక్ష్మి ...వాది
మరియు
బండారు వెంకట మణి @ మణి కుమార్ వగైరాలు ...ప్రతివాదులు

5వ ప్రతివాది :
శ్రీమతి నాగం స్వాతి, W/o.సుధీర్, D/o. లేట్: వెంకట సుబ్బయ్యనాయుడు, కుప్పనపూడి గ్రామం, ఆకివీడు మండలం, పశ్చిమ గోదావరి జిల్లా.

పై నెంబరు గ్రంథంలో 5వ ప్రతివాది అయిన శ్రీమతి నాగం స్వాతి గార్కి శ్రీయుత కోర్టు వారి ద్వారాను మరియు రిజిష్టరు పోస్టు ద్వారాను నోటీసులు పంపినను తీసుకొనక, కాలయాపన చేయుచున్నారని, దానిపై శ్రీయుత కోర్టు వారు పేపరు ప్రకటన అనుమతి మంజూరు చేసియున్నారు. శ్రీయుత కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం **ది.01-08-2024** తేదీకి వాయిదా అయి వున్నది. కావున 5వ ప్రతివాది అయిన శ్రీమతి నాగం స్వాతి గారు **ది.01-08-2024 ఉదయం 10.30 ని॥లకు** తమ అభ్యంతరములు స్వయంగా గాని, తమ అడ్వకేట్ గారి ద్వారా గాని శ్రీయుత కోర్టు వారి ఎదుట హాజరై తమ ఆక్షేపణలు తెలియచేసుకొనవలెను. లేనియడల సదరు 5వ ప్రతివాది అయిన శ్రీమతి నాగం స్వాతి గారిని పరోక్షమున తీర్మానించబడును అని అని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

అల్లూరి వెంకటేశ్వరరాజు
భీమవరం వాది తరపు అడ్వకేట్,
తేది.13-7-2024 సెల్: 9848211102

పత్రికా ప్రకటన

మహారాజశ్రీ పాలకొల్లు ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో పాలకొల్లు

O.S. No. 77/2023

బిట్వీన్:
పైలా లక్ష్మి -వాది
మరియు
తాడి శ్రీనివాసులు @ శ్రీను (లేటు) వగైరా -ప్రతివాదులు

టు:
2వ ప్రతివాది:
తాడి వెంకటలక్ష్మి, W/o శ్రీనివాసులు @ శ్రీను (లేటు) డోర్ నెం. 17-8-7, 7వ వార్డు, పల్లపు వీధి, పాలకొల్లు, ప.గో.జిల్లా.

3వ ప్రతివాది:
తాడి వెంకటేశ్వరరావు, S/o శ్రీనివాసులు @ శ్రీను (లేటు) డోర్ నెం. 17-8-7, 7వ వార్డు, పల్లపు వీధి, పాలకొల్లు, ప.గో.జిల్లా.

పై నెంబరు దావాలో ఎన్ని పర్యాయాలు శ్రీ కోర్టు వారు మీకు దావాసమన్లు పంపించినప్పటికి మీరు ఉద్దేశపూర్వకంగా దావాసమన్లు అందుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టు వారు ఈ పేపరు ప్రకటన ద్వారా మీకు నోటీసు జారీ చేసియున్నారు. దావా **ది. 22-07-2024వ తేదీనకు** వాయిదా అయివున్నది. కావున మీరు వ్యక్తిగతంగా గాని లేదా మీ పరోక్షమున ప్లీడర్ గారి ద్వారా గాని కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి మీ వాదన దాఖలు చేసుకొనవలెను. సదరు దావాకు మీరు హాజరు కాని యెడల మీ పరోక్షమున దావా గ్రంధము జరుపబడునని తెలియచేయడమైంది.

(By Order)

వలవల సత్యనారాయణ మూర్తి
M.A., B.Ed., L.L.B
తేది:13-07-2024 **సంగినీడి శ్రీ ఆంజనేయులు**
పాలకొల్లు B.A., L.L.B.,
న్యాయవాదులు, పాలకొల్లు
సెల్: 9849038805, 9030256223